# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మంత్రి కేటీఆర్‌కు లక్షకు పైగా మెజార్టీ అందించండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల పోలింగ్‌బూత్ స్థాయి ఇన్‌చార్జిలతో తెలంగాణభవన్‌లో సమావేశం




బీఆర్ఎస్‌లో చేరిన కోనరావుపేట మండల నాయకులతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

సిరిసిల్ల/ సిరిసిల్ల టౌన్ నవంబర్ 18: తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల పోలింగ్‌బూత్ స్థాయి బీఆర్ఎస్ ఇన్‌చార్జిలైన ఎన్నికల వారియర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్‌తో పాటు పోలింగ్ సమయంలో ఎలాంటి వ్యూహాలు అనుసరించాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలకు ఉన్న బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని అంశాలను ఒక్కొక్కటిగా ప్రజలకు విపులంగా వివరించాలని సూచించారు. సంక్షేమ పథకాలన్నింటినీ గడపగడపకూ వివరించాలన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు సాగిన ఉద్యమ, ప్రభుత్వ పాలన, సాధించిన విజయాలు, ఇంకా సాధించాల్సిన పలు అంశాల గురించి వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా వారియర్స్ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంత్రి కేటీఆర్‌ను ఈ సారి భారీ మెజార్టీతో గెలిపించుకొనేలా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, పోతుగల్ పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు, ఆయా మండలాల పార్టీ పోలింగ్‌బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో బూత్ కమిటీల సమావేశంలో పాల్గొన్న పోలింగ్‌బూత్ ఇన్‌చార్జిలు

### బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేతలు

కోనరావుపేట మండలానికి చెందిన బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఒగ్గు ప్రభాకర్, నాయకులు మిర్యాల్‌కార్ హరీశ్, అరవింద్, ఊరడి ఆనంద్‌తోపాటు పలువురు కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ కుంబాల మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.



మధురానగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# అవినీతిని నిరూపించాలె

- లేకుంటే ఎన్నికల నుంచి తప్పకుంటవా?
- మధురానగర్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా?
- మేడిపల్లి సత్యానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సవాల్

గంగాధర, నవంబర్ 18: దళితబంధులో తాను అవినీతికి పాల్పడినట్లు కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి సత్యం చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, తాను అవినీతికి పాల్పడితే మధురానగర్ చౌరస్తాలో ఆధారాలతో నిరూపించాలని.. లేదంటే ఎన్నికల నుంచి తప్పుకోవాలని మేడిపల్లి సత్యానికి చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సవాల్ విసిరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. మండలంలోని మధురానగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుంకె రవిశంకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పర్యటనతో బీఆర్ఎస్‌లో జోష్ వచ్చిందన్నారు. మహిమాన్విత పుణ్యక్షేత్రం కొండగట్టు ఆలయాన్ని ₹వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. గంగాధర మండలంలోని గర్శకుర్తి, రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామనడంపై హర్షం వ్యక్తం చేశారు. పోతారం రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల నిర్మాణం, మద్దట్ల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాద సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలకు, సభ విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు సుంకె రవిశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు శుక్రుద్దీన్, జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసంకుల అనంతరావు, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, కొండగట్టు డైరెక్టర్ ఉప్పుల గంగాధర్, సర్పంచులు వేముల లావణ్యాఅంజి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, శ్రీమల్ల మేఘరాజు, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, రామిడి సురేందర్, ఆకుల మధుసూదన్, మహేశుని ఈశ్వరయ్య, కర్ర బాపురెడ్డి, నారాగరపు సత్యనారాయణ, గునుకొండ బాబు, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ అబ్బాస్, సోకల మల్లేశం, లింగాల దుర్గయ్య, దోమకొండ మల్లయ్య, గుండవేణి తిరుపతి, గంగాధర కుమార్, గంగాధర సంపత్, సంజీవ్, గంగాధర వేణు పాల్గొన్నారు.

# మీ బిడ్డ కావాలా? పరాయివాళ్లు కావాలా?

- కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- ఇబ్రహీంపట్నం మండలంలో ఎన్నికల ప్రచారం

ఇబ్రహీంపట్నం, నవంబర్ 18: 'బీజేపీ నాయకుడు ఎంపీగా గెలిచి ఐదేండ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. కులాలు, మతాల పేరిట గ్రామాల్లో చిచ్చు పెట్టడమే తప్పా ఒక్క కుల సంఘానికైనా నిధులిచ్చారా..? ఒక్కసారి ఆలోచించాలి. ఇగ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు ఐదేండ్ల క్రితం వచ్చిండు. మళ్లీ ఓట్లప్పుడు వచ్చి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అంటున్నడు. ఎన్నికలు వస్తున్నాయంటే వచ్చే వాళ్లను నమద్దు. మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండే మీ బిడ్డ కావాలా..? పరాయివాళ్లు కావాలా..? మీరే ఒకసారి ఆలోచించుకోవాలి' అని కోరుట్ల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విజ్ఞప్తి చేశారు. మీకు అందుబాటులో ఉండి సేవలందించే తనను గెలిపిస్తే, మరింత అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన ఇబ్రహీంపట్నం మండలంలోని కేశాపూర్, కోజన్‌కొత్తూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్థిపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామ శివారులో నుంచి ప్రధాన కూడలి వద్దకు ర్యాలీగా తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉద్యోగవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గంలో ఐటీ హబ్ ఏర్పాటు చేశానన్నారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు మూడు గంటలిస్తామంటున్న రేవంత్‌రెడ్డి కావాలా..? మరీ 24 గంటలు ఉచితంగా కరెంటిచ్చే కేసీఆర్ ప్రభుత్వం కావాలా..? ప్రజలే ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్ అరవై ఏండ్ల దరిద్రాన్ని పారదోలి, తొమ్మిదేండ్లలోనే అభివృద్ధి చేసి చూపించారన్నారు. అటువంటి నాయకుడిని వదులుకుందామా..? చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల కోసం అహర్నిషలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు.



ర్యాలీలోగ్రామస్తులకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# కాంగ్రెస్‌కు ఓటేస్తే జీవితాలు ఆగమే

- రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరైతది
- కష్టాలే దిక్కవుతయి.. పథకాలు రావు
- ప్రజా ఆశీర్వాద యాత్రలో ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి. మంత్రి కొప్పుల ఈశ్వర్




మద్దులపల్లిలో పలువురు నేతలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి, నవంబర్ 18: 'తమది గొప్ప పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏండ్ల కొద్ది పాలించి, అధ్వానం పట్టించింది. చీకటి బతుకులు చేసింది. ఒక్క అభివృద్ధి చేయలే. ప్రజలకు సమస్యలు తప్ప, సంతోషం లేకుండా చేసింది. ఇప్పుడు మళ్లీ గ్యారెంటీలంటూ అసత్య ప్రచారం చేస్తూ జనాలను మభ్యపెడుతున్నది. నేనొక్కటే చెబుతున్నా.. కాంగ్రెస్ చెప్పే మాటలను నమ్మి ఓటేశారో..? జీవితాలు ఆగమవుతయి. రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే అవుతుంది'' అని ధర్మపురి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. కాంగ్రెస్ వస్తే రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్తుందని, మళ్లీ చీకటి కష్టాలు మొదలవుతాయని, పథకాలు బందైపోతాయని చెప్పారు. పెగడపల్లి మండలం మద్దులపల్లి, బతికపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర చేశారు. ఆయా చోట్ల మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. బొట్టుపెట్టి మరీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ప్రజల కోసమే అనునిత్యం 18 గంటల పాటు పని చేస్తున్నానని చెప్పారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. రైతులకు 3 గంటల కరంటే చాలని రేవంత్‌రెడ్డి బాహాటంగానే చెబుతున్నారని, సాగుకు మూడు గంటలు చాలా..? అని ప్రశ్నించారు. ఇంకా 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని సాగు నీరు పారించుకోవాలని అంటున్నాడని, ఇది సాధ్యం అవుతుందా..? అన్నారు. ఇటువంటి కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, మూడు గంటల కరంటే దిక్కవుతుందని, పథకాలు బందైపోతాయన్నారు. 24 గంటల కరెంట్ కావాలంటే.. అభివృద్ధి, సంక్షేమం జరుగాలంటే.. బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు. ముఖ్యం గా దేశానికి అన్నం పెట్టే రైతన్న జీవితాన్ని బాగు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తన పదవీ కాలంలో ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో చేశానని, మళ్లీ ఆశీర్వదించి గెలిపించాలని, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.

# మోసపోతే గోసపడుతాం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 18: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోతే గోసపడుతామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హెచ్చరించారు. కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు మద్దతుగా శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్రాపూర్, ఎర్రాపూర్ తండాలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మరో మారు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అవకాశమిచ్చి గెలిపించాలని కోరారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని బీడీ పింఛన్‌ను తెలంగాణలో సీఎం కేసీఆర్ అందిస్తున్నారన్నారన్నారు. గిరిజనులకు పోడు భూముల హక్కులను కల్పిస్తానన్నారు. విద్యార్థులకు ఉద్యోగవకాశాలను కల్పించేందుకు కోరుట్లలో ఐటీ హబ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, ఉద్యోగ బాధ్యతలు తన తనయుడిదే అన్నారు. తనను ఆదరించినట్లుగానే తన కుమారుడిని ఆదరించి బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ నునావత్ శాంతాబాయి, ఎంపీటీసీ మాలావత్ సరోజ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేశ్, నాయకులు వెంకట్, జవహర్‌లాల్, రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




ఎర్రాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు